క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమైన అంశాలు చర్చిస్తామని, పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

ఏడీఏగా రవి



తాడిపత్రి రూరల్: తాడిపత్రి వ్యవసాయశాఖ ఏడీగా రవి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న చెంగల్‌రాయుడు కర్నూలు జిల్లా ఆలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం ఏడీఏగా ఉన్న రవి బదిలీపై తాడిపత్రికి వచ్చారు.

పోలేరమ్మ ఆలయంలో హుండీ చోరీ

పెద్దపప్పూరు: మండలంలోని నామనాంకపల్లిలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో హుండీని గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామసమీపంలోని వంకలో పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లి ఖాళీ హుండీని అక్కడే వదిలారు. ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించి గ్రామస్తులను విచారించారు. మూడు నెలల క్రితమే హుండీలోని కానుకలను లెక్కించామన్నారు. ప్రస్తుతం దుండగులు దోచుకెళ్లిన నగదు రూ.2 వేలకు మించి ఉండదన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు ఎస్‌ఐ వివరించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



డీఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: సీఐటీయూ కాలనీలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. శుక్రవారం ట్రాన్స్‌కో డీఈ నాగేంద్రను సీపీఎం నాయకులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేయాలన్నారు. స్తంభాలను ఏర్పాటు చేసి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించి, ఆ స్థానంలో కొత్తవాటిని అమర్చి నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏకగ్రీవం



మండల కమిటీ సభ్యులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

పుట్లూరు: మండల ఎమ్మార్పీఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చిన్న సుబ్బారావు, అధ్యక్షుడు హరిగోపాల్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద మండల కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా గోపురాజుపల్లి నరేష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, కార్యదర్శిగా మల్లికార్జున, ప్రచార కార్యదర్శిగా ఉమేష్, అధికార ప్రతినిధిగా దివస్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా పెద్దిరాజు, ప్రమోద్, నాగారాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు పెద్దిరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాటు సారా ధ్వంసం

గుత్తి: గుత్తి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పాళ్యం తండాలో 90 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ ఉమాదేవి శుక్రవారం తెలిపారు. నాటు సారా ఊటను ధ్వంసం చేయడంతో పాటు సుంకేనాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా నాటు సారా విక్రయాలు, తయారీ, రవాణా జరుగుతున్నట్లెతై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

తాడిపత్రిలో చైన్ స్నాచింగ్

తాడిపత్రిటౌన్: మండలంలోని గన్నెవారిపల్లిలో శుక్రవారం సాయంత్రం వాకింగ్ చేస్తున్న కాంతమ్మ అనే మహిళ మెడలో దాదాపు మూడు తులాల బంగారు చైన్‌ను ఇద్దరు దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

రోగులతో ఆస్పత్రి కిటకిట

- వేధిస్తున్న వైద్యుల కొరత
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వైద్యం కోసం వచ్చిన రోగులతో కిక్కిరిసిన గుత్తి ప్రభుత్వాస్పత్రి

గుత్తి: గుత్తి ప్రభుత్వాసుపత్రి శుక్రవారం రోగులతో కిట కిటలాడింది. వారం రోజులుగా రోగుల సంఖ్య అధికమైంది. సాధారణంగా ఓపీ 350 నుంచి 400 దాకా ఉంటుంది. అయితే వారం రోజులుగా ఓపీ అమాంతం పెరిగిపోయింది. 500 కంటే అధికంగా ఓపీ వచ్చింది. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండంతో రోగుల సంఖ్య పెరిగింది. ప్రధానంగా మండలంలో అతిసారం వ్యాధి ప్రబలుతోంది. అయితే ఆస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. 11 మంది ఉండాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇందులో ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు. రౌండ్ ది క్లాక్ డ్యూటీ ఉన్న వైద్యులు కూడా సరిగా అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. కానీ వైద్యుల సంఖ్య రోజు రోజుకూ తగ్గుతోంది. చిన్న పిల్లలు, గైనిక్, ఆర్థోపెడిక్ వైద్యులు లేరు. ఎక్స్‌రే ఆపరేటర్ కూడా అందుబాటులో లేడు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులను నియమించాలని పలుమార్లు ప్రజా సంఘాల నాయకులు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రికి సరిపడా వైద్యులను నియమించాల్సి ఉంది.



వైద్యుల కోసం వేచి ఉన్న రోగులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసారం బాధితులు

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల ఎంపిక



పూల ప్రసాద్, శింగనమల



గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, బుక్కరాయసముద్రం



వై.ఎల్లారెడ్డి, గార్లదిన్నె



ఖాదర్‌వలి ఖాన్, నార్పల



మహేశ్వర్‌రెడ్డి, పుట్లూరు

శింగనమల: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల కమిటీలను ఎంపిక చేశారు. కమిటీలో యువతకు పెద్ద పీట వేశారు. శింగనమల మండలాధ్యక్షుడిగా పూల ప్రసాద్, బుక్కరాయసముద్రం మండలాధ్యక్షుడిగా గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, గార్లదిన్నె మండలాధ్యక్షుడిగా వై.ఎల్లారెడ్డి, నార్పల మండలాధ్యక్షుడిగా బాయకాటి ఖాదర్‌వలి ఖాన్, పుట్లూరు మండలాధ్యక్షుడిగా పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డిని నియమించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా బి.వెంకటరమణయ్య, జిల్లా అధికార ప్రతినిధిగా పసుపులేటి పద్మావతి, రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శిగా బి.లలిత కళ్యాణి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా వరికూటి కాటమయ్య, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఎం.రవికుమార్ నాయక్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా సి.హనుమంతరెడ్డి నియమితులయ్యారు. అలాగే నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను ఎంపిక చేశారు. యువజన విభాగం అధ్యక్షుడిగా సి.భాను కిరణ్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎ.పార్వతి, రైతు విభాగం అధ్యక్షుడిగా ఆర్. పుల్లారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎం.ఆంజనేయులు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సాకే లక్ష్మీనారాయణ, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా మర్తాడు ఆలీ బాషా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా యు.ఆనంద్, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా వి.రేవంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా కె.భాస్కర్‌రెడ్డి, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా హెచ్.నాగరాజు, వలంటీర్ విభాగం అధ్యక్షులుగా వై.వి.క్రిష్టారెడ్డిని నియమించారు. గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా పి.పరమేశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా కె.భాస్కర్‌రెడ్డి, వీవర్స్ అధ్యక్షుడిగా యు.కాటమయ్య, వైఎస్సార్‌టీయూసీ విభాగం అధ్యక్షుడిగా వై.శేషానందారెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా కె.వి.రమణారెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా నీలం భాస్కర్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా పి.ఆశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ విభాగం అధ్యక్షుడిగా డాక్టర్.కె. నాగేంద్ర రెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా జె.అనిల్‌కుమార్‌రెడ్డిని నియమించారు.

గ్రామాభివృద్ధిపై సర్పంచులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రామాంజనేయులు

గుత్తి రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లకు మాస్టర్ ట్రైనర్లు రామాంజనేయులు, ఓబిరెడ్డి శిక్షణ ఇచ్చారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం గుంతకల్లు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల మహిళా సర్పంచ్‌లకు పంచాయతీల అభివృద్ధిపై రెండో రోజు శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈ సందర్భంగా శిక్షకులు గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు గుర్తించి పరిష్కరించాలన్నారు. పంచాయతీల పరిధిలో అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేష్ పాల్గొన్నారు.

గోరింటాకు అలంకరణలో వాసవీమాత



యాడికి: గోరింటాకు అలంకరణలో వాసవీమాత



పామిడి: శాకాంబరి అలంకరణలో కన్యకా పరమేశ్వరి

యాడికి: మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గోరింటాకు అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అమ్మ వారు భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా కోమటి బజారులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఆర్య వైశ్య సంఘం మహిళలు గోరింటాకుతో అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శాకాంబరి అలంకరణలో..

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరిమాత శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆషాఢ మాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని వాసవి మాతృమండలి ఆధ్వర్యంలో అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేద పండితుని మంత్రోచ్చరణల నడుమ అష్టోత్తర, శతనామావళి, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వాసవి మాతృమండలి గౌరవ అధ్యక్షురాలు రాజేశ్వరి, అధ్యక్షురాలు ఎన్‌వీఎస్ నాగవల్లి, కార్యదర్శి కీర్తి, ఆర్యవైశ్యం సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న వంశీయాదవ్

గుంతకల్లుటౌన్: మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత, స్థాయి జనసేన పార్టీ నాయకులకు లేదని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీయాదవ్, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పట్ల జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయబాధ్యుడు మణికంఠ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వారు ఘాటుగా స్పందించారు. మణికంఠ తీరుపై సొంతపార్టీ సీనియర్ నాయకులే ఆ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసిన విషయాన్ని మర్చిపోతే ఎలా అని వారు ప్రశ్నించారు. మణికంఠకు చేతనైతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని వార్డుల్లో పోటీచేసి గెలవాలని వారు సవాల్ విసిరారు. జగనన్న మానవత్వం గురించి మరోసారి మాట్లాడితే ప్రజలే తగిన రీతిలో బుద్ధిచెబుతారన్నారు. అలాగే కసాపురం ఆలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలకడంపై తప్పుపట్టారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి ప్రొటోకాల్‌కు మంగళం పాడిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం వలంటీర్ల, ఐటీ విభాగాల అధ్యక్షులు పవన్, సూర్యరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ పరుశురాముడు, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్, కార్యదర్శి శివ, అనుబంధ సంఘాల అధ్యక్షులు మనోజ్‌కుమార్, రామ్మోహన్, రాజశేఖర్, మణికంఠ, దాదాఖలందర్, సంజీవ్, దర్గానాయుడు, రాము, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని సర్పంచ్లు, ఎంపీటీసీలు, మండల కో-ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని వారు కోరారు. అధికారులు మూడు నెలల ప్రగతి నివేదికలు వెంట తీసుకు రావాలన్నారు.

వ్యక్తి బలవన్మరణం



యల్లప్ప (ఫైల్)

గార్లదిన్నె: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కల్లూరులోని కొండకింద కొట్టాల ప్రాంతానికి చెందిన యల్లప్ప (50)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. నైటీల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునే వాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వ్యాపారం కొనసాగించలేక అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న యల్లప్ప శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం



మాట్లాడుతున్న సురేష్

గుంతకల్లుటౌన్: దేశంలో మోడీ సర్కారు కొనసాగిస్తున్న నియంతృత్వ అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ సర్కారు 11 ఏళ్ల పరిపాలనంతా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీకి మించి ఉందన్నారు. దేశంలో పత్రికా స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ, పౌరహక్కుల మీద తీవ్ర అణచివేతను ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జిలాన్, సత్తార్, రామాంజినేయులు, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత తొలగింపు



చెత్త తొలగిస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న అపరిశుభ్రతపై డీఎం నందిని స్పందించారు. ఇటీవల 'సాక్షి'లో బస్టాండ్‌లో పేరుకున్న అపరిశుభ్రత అంటూ వచ్చిన కథనంపై డీఎం స్పందించి కూలీల ద్వారా చెత్తా చెదారాన్ని తొలగించి కాల్చి వేయించారు. మురికిగా ఉన్న ప్రాంతాల్లో గర్సు వేయించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా బంకించంద్ర చటర్జీ జయంతి



చటర్జీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శుక్రవారం వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ 187వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చటర్జీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, అదనపు కార్యదర్శి కుళ్లాయి బాబు, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలవు మంజూరు చేయండి

యాడికి/గుత్తిరూరల్/పెద్దవడుగూరు: అనంతపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో తమ సమస్యలను తెలిపేందుకు శనివారం అనంతపురం వెళ్తున్నామని, సెలవు మంజూరు చేయాలని యాడికి మండలంలోని సచివాలయ కార్యదర్శులు ఎంపీడీఓ వీరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సచివాలయాల సర్వేలు పనిభారం కార్యదర్శుల మీద పడుతొందన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్ అనేవి ఏ శాఖలో లేనప్పటికీ కేవలం పంచాయతీరాజ్ శాఖలో తమను మాత్రమే అడుగుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు చెబితే వినే అధికారులు ఎవరూ లేరన్నారు. సామూహిక సెలవు పెట్టి కలెక్టర్‌తో తమ సమస్యలు చెప్పుకునేందుకు తీర్మానించామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు మహేశ్వరరెడ్డి, అరుణ్, వెంకటరాజు, సుజాత, రాజేశ్వరి, రామ్ సతీష్ కుమార్, రమేష్ రెడ్డి, హాజీవలి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



యాడికిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు



పెద్దవడుగూరులో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు

- గుత్తి పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్‌కు పంచాయతీ కార్యదర్శులు సెలవు మంజూరు, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యదర్శులు వెంకటేష్, ఎర్రిస్వామి, ధనలక్ష్మి, సుమలత, శాంతి, మహబూబ్‌బాషా, గౌడ్ పాల్గొన్నారు.
- పెద్దవడుగూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయితీ కార్యదర్శులందరూ శనివారం సామూహిక సెలవు కావాలని కోరుతూ ఎంపీడీఓ బారన్‌సాహెబ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరెడ్డి, రామాంజినేయులు, రమేష్‌నాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు



అల్లపీరా కాలనీ ఆర్చ్ వద్ద నిలిచిన మురుగు

గుంతకల్లు: స్థానిక ఆలూరు రోడ్డులోని సద్గురు గుడికల్లు అలీపీరా స్వామి కాలనీలోని ముఖ ద్వారం వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గం గుండా ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌జేపీ హైస్కూలు, ఉర్దూ హైస్కూల్ తదితర పాఠశాలలు ఉండటంతోపాటు పట్టణంలోకి వెళ్లడానికి ఈ మార్గం షార్ట్ కట్‌గా ఉపయోగపడుతుంది. దీంతో విద్యార్థులతోపాటు ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఈ మార్గాన్నే ఎంచుకుంటారు. అయితే ఈ కాలనీ ముఖ ద్వారం ఆర్చ్ వద్ద కొంత మేర దిగువగా ఉండటంతో నిత్యం మురుగు నిల్వలు ఉంటున్నాయి. దీంతో మురికి నీరు ద్విచక్ర వాహనాల్లోకి వెళ్లి వాహనాలు నిలబడిపోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు సమాంతరంగా కల్వర్టును ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

అదుపు తప్పితే అంతే సంగతులు



ప్రమాదకరంగా ఉన్న ప్రదేశం

తాడిపత్రిరూరల్: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలోని ఉన్న సిమెంట్ రోడ్డుకు ఏర్పాటు చేసిన కాలువపై అక్కడక్కడా సిమెంట్ మూతలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. రూరల్ పోలీసుస్టేషన్‌కు ఎదురుగా సిమెంట్ రోడ్డుకు కాలువపైన కొన్ని చోట్ల సిమెంట్ మూతలతో మూసినా మరికొన్ని చోట్ల అధికారులు పట్టించుకోలేదు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అదుపుతప్పినా పెద్ద ప్రమాదంలో పడుతారు. ఈ విషయాన్ని అధికారులు గ్రహించకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు.

మొహర్రం ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

గార్లదిన్నె: మొహర్రం ఉత్సవాలకు గ్రామస్తులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా సూచించారు. శుక్రవారం ఎస్‌ఐ మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని తబ్జుల గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సీజ్ చేశారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు: మండలంలోని తెలికి గ్రామానికి చెందిన మహమ్మద్ అనే వ్యక్తి విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. మహమ్మద్ తెలికికి చెందిన ఓ అమ్మాయిని వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు . ఇంట్లో సమస్యలు అధికం కావడంతో విష రసాయనం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.